
# కళ

**– టి.పి.హేమమాలిని**



భూమిని తడిపే చిరు జల్లుల్లాంటి ఉత్తరాలు అప్పుడప్పుడు మనసును ఆర్ద్రతకు గురిచేస్తున్నా, పైరు ఎదగడానికి అవసరమయ్యేంత వర్షం కురిసినట్లు, మా స్నేహపు సస్యం మరింత పచ్చగా ఉండేలా చెయ్యబోతోంది మా మిత్ర సమావేశం.

“అమ్మా! పెరుగాంటీ వచ్చింది” అంటూ నా చేతిలోని బ్యాగును తన చిన్న చేతులతో గబగబా అందుకుని, దాన్ని ఈడ్చుకుంటూ లోపలికి పరుగెత్తాడు పదేళ్ళ రోహిత్, వసంత కొడుకు.

“గడుగ్గాయ్! నా ఫ్రెండ్ అద్భుతమైన పేరు ‘అక్షయ’ని పెరుగాంటీగా మార్చేసావా?” అంటూ నవ్వుతూ ఎదురొచ్చింది వసంత.

నాలుగేళ్ళ కిందట వరకు వసంత వాళ్ళు, మేము ఒక దగ్గరే ఉండేవాళ్ళం. మాకు ట్రాన్స్‌ఫరవడంతో హైదరాబాద్ వెళ్ళిపోయాం. వాడి చిన్నతనంలో పెరుగు తియ్యగా ఉంటేనే తప్ప అన్నం తినేవాడు కాదు. వసంత ఎంత జాగ్రత్తగా తోడువేసినా పెరుగు పులిసిపోయేది. రోజూ నన్నే అడిగి పెరుగు పట్టుకెళ్తే గానీ అన్నం తినేవాడు కాదు. అలా నా పేరు పెరుగాంటీ అయిపోయింది.

“వసూ! లత, లలిత, ఇంద్రాణి ఇంకా రాలేదా?” అడిగాను.

“ఇంద్రాణి వచ్చింది. లత, లలిత సాయంత్రానికి వస్తారు” అంటూ నాకు శీతలోపచారాలు చేసింది వసంత.

పిల్లలకు వేసవి శెలవులు కావడంతో వసంత కొడుకు రోహిత్, కూతురు వర్ష ఇంటి దగ్గరే ఉన్నారు.

నా పుత్రికారత్నానికి కార్పొరేట్ స్కూల్ వాళ్ళు సెలవుల్లో కూడా టెన్త్ క్లాస్ సిలబస్ నూరిపోసే ప్రక్రియలో భాగంగా సెలవివ్వమంటే దానిని వదిలి రాక తప్పలేదు, తనని జాగ్రత్తగా చూసుకుంటాను వెళ్ళి రమ్మని పతిదేవులు అభయమివ్వడంతో.

“వసంతా! మీవారు ఆఫీసుకెళ్ళారా?”

“మనకు ఆయనవలన ఏమైనా అంతరాయం కలుగుతుందేమోనని చింతించి స్వగ్రామానికి దయచేసారు. నాల్రోజులు సెలవుపెట్టి” చెప్పింది వసంత.

స్నానం చేసి వచ్చిన ఇంద్రాణి నన్ను చూసి ఆనందపడిపోయి ఆశ్చర్యపోయింది.

“అక్షయా! మూడేళ్ళయింది కదే నిన్ను చూసి! అసలేం మార్పులేదు నీలో. ఎలా మెయిన్‌టెయిన్ చేస్తున్నావే బాబూ!” అంటూ హడావిడి చేసింది.

“నీకు ఇంకా ఫిగర్ మెయిన్‌టెయిన్స్ పిచ్చిపోలేదే!”.

“ముప్ఫయి ఐదు నిండినా నేనూ స్మార్ట్‌గా ఉంటే ఇదే డైలాగ్ కొట్టేదాన్ని.”

ఎంత కంట్రోల్డ్‌గా ఉన్నా ఒళ్ళు తగ్గడం లేదు.” వాపోయింది ఇంద్రాణి. ముగ్గురం సరదాగా కబుర్లు నంజుకుంటూ భోంచేసాం.

వసంత కొడుకు రోహిత్‌ని చూస్తే ముచ్చటేసింది. ప్రతి పనిలోనూ తన చిన్ని చెయ్యి పెట్టాలని చూస్తాడు.

వసంత అన్నం గిన్నెలు సర్దేలోగా కంచాలు పెట్టేసాడు. అన్నం వడ్డించే లోపు అందరికీ మంచినీళ్ళు ఫిల్టర్‌లో పట్టి పెట్టేసాడు.

టాంక్‌లో నీళ్ళున్నాయో లేదోనని వసంత అనుకుంటే వెంటనే వెళ్ళి మోటర్ స్విచాన్ చేసాడు. మళ్ళీ పావుగంట తర్వాత ఆఫ్ చేసాడు. ఇవన్నీ సాధారణంగా ఏ పిల్లలైనా చెప్తేగానీ చెయ్యరు. చెప్పినా చెయ్యరు కొందరు. రోహిత్ వసంత చెప్పకుండానే గ్రహించి కొన్ని చేస్తే, అమ్మ చెప్తే చాలన్నట్లుగా కొన్ని చేస్తున్నాడు. చాలా ముచ్చటేసింది.

సాయంత్రంకాగానే లత, లలిత పిల్లలతో దిగారు.

లతకి ఓ కొడుకు, లలిత ఓ కూతురు, ఓ కొడుకు చంటి పిల్లాడు.

పిల్లలందరూ తెగ తుళ్ళుతున్నారు. చలి దేశాల నుండి వలస వచ్చిన వింత వింత సీతాకోక చిలుకల్లా శోభిస్తున్నారు.

ఏడు దాటగానే పిల్లలందరూ టీ.వి. ముందు కూచుని కార్టూన్ ఛానల్‌లో లీనమయ్యారు.

పిల్లలందరి కోరికపై పూరీ కూర చేస్తున్నాం. మేమంతా కిచెన్‌లో ఉన్నాం. లలిత కొడుకు బావున్నాడు ముద్దుగా, బొద్దుగా. పదో నెల వాడికి. గబగబా పాకేస్తూ కలతిరిగేస్తున్నాడు హాలంతా. రోహిత్ కూడా వెళ్తున్నాడు. వాడిని ఫ్రీగా తిరగనిస్తూనే వాడికేం కాకుండా కనిపెట్టుకుంటూ తిరుగుతున్నాడు.

“రోహిత్! గులాబ్‌జామ్ ప్యాకెట్ తీసుకొస్తావా నాన్నా!” అరిచింది వసంత. వెంటనే పరుగెత్తుకొచ్చాడు.

“అమ్మా! గులాబ్‌జామ్ చేస్తావా! సూపర్!” అంటూ తూనీగలా రివ్వున పరుగెత్తి అంత వేగంగానూ తల్లి చెప్పింది తెచ్చేసాడు.

అందరూ టామ్ అండ్ జెర్రీ చూస్తున్నారు. చంటివాడి ఏడుపు వినిపించింది. కిచెన్‌లో నుంచి నేను చూస్తున్నాను. రోహిత్ గబగబా వచ్చి పడిపోయిన పసి పిల్లాడిని లేవదీసి ఎత్తుకున్నాడు.

లలిత గబుక్కున వెళ్ళింది. “ఆంటీ! ఫరవాలేదు. ఏం కాలేదు. పాకుతూనే సోఫా పట్టుకుని లేచి నిలబడాలని ట్రై చేసాడు. నిలబడలేక పడిపోయాడు. ఏం ఫరవా లేదు కదమ్మా! హన్నా! చూడు నేలకి ఎంత దెబ్బతగిలిందో!” అంటూ నేల మీద తన చేత్తో గట్టిగా రెండు సార్లు కొట్టాడు. నిజంగా వాడికేదో అర్థమైనట్లే పసివాడు. బోసి నవ్వులు చిందించాడు.

యధాలాపంగా చూస్తే పిల్లలందరూ ఒక్క అంగుళం కూడా కదలకుండా తీవ్రమైన ఉత్కంఠతో చూస్తున్నారు కార్టూన్ సీరియల్‌ని. అక్కడో పసివాడున్నాడని, వాడికేదో అయిందనే ధ్యాసే వారికి లేదు.

పసివాడిని సోఫాలో కూచోబెట్టి ఫ్రిజ్‌లోంచి పుచ్చకాయ ముక్క తీసుకొచ్చి ఎర్రటి భాగమంతా చిన్నచిన్న గుజ్జులా చేసి వాడికి తినిపించసాగాడు రోహిత్.

ఆలోచించి చూస్తే రోహిత్‌లో ఏదో ప్రత్యేకత కనిపించింది.

మర్నాడు ఉదయన్నే టిఫిన్ సెక్షన్ పూర్తి చేసి పిల్లలకు బీచ్, ఎమ్.జి.ఎమ్. సెల్వివరల్డ్ చూపించాలని బయల్దేరాం. లలిత కొడుక్కి కావలసిన పాలు, కొద్దిగా అన్నం పట్టుకుంది. విశాఖ అందానికే వన్నె తెచ్చిన, సౌందర్య కిరీటంలో కలికితురాయిలా భాసించే బీచ్ ఎగసిపడే అలలతో ఆకట్టుకుంది పిల్లలందరినీ. ఆ రోజంతా ఎంజాయ్‌మెంటే. అలసిన పిల్లలు హాయిగా నిద్రపోయారు ఆ రాత్రి.

మా మిత్ర బృందం మాటకచేరీలో చిన్ననాటి ముచ్చట్లు, యవ్వనపు మురిపాలు, కాలేజీ రోజుల కబుర్లు ప్రధానపాత్ర పోషించాయి.

సంసార బాధ్యతలు, అత్తింటి విశేషాలు, భవిష్యత్ ప్రణాళికలు వాటి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

తిరిగి తిరిగి సంభాషణ పిల్లల చదువులు, అలవాట్లు మీదకి మళ్ళింది. “నిజంగా చెప్పాలంటే నా కూతురు పూర్వజన్మలో ఏ యక్షిణో, గంధర్వ కన్యో అయ్యుంటుందనిపిస్తోంది. దాని గొంతు అద్భుతం, ఏ సినిమా పాట విన్నా ఇట్టే పట్టేస్తుంది. దానిలోని ప్రతిభను కనిపెట్టి మంచి గురువుదగ్గర శాస్త్రీయ సంగీతం నేర్పిస్తున్నాను. ఈమధ్య ఓ టి.వి. ఛానల్ వాళ్ళు నిర్వహించిన “పాడవేల రాధికా!” ప్రోగ్రామ్‌లో సెలక్టయింది. వాళ్ళు వచ్చేనెల నుంచీ రికార్డింగ్‌కి రమ్మన్నారు. భగవంతుడు చల్లగా చూసి అది ఆఖరువరకూ బాగా పాడి విజేతగా నిలబడితే బాగుండునని నా కోరిక.” చెప్పింది ఇంద్రాణి.

“సరే కానీ! పద మూడేళ్ళ పిల్లయింది కదా! నీకేమైనా సాయంచేస్తూ ఉంటుందా?” అడిగాను.

“అయ్యో రాత! దానికీ నేనన్నీ అమర్చిపెడ్తే గానీ పక్కమీద నుంచి లేవదు. పైగా దానికేం చెప్పకూడదని శ్రీవారి ఆర్డర్. రోజురోజుకీ గారాబం ఎక్కువైపోతోంది. అందులోనూ ఈ కాంపిటీషన్‌కి సెలక్టయిన దగ్గర నుండి మరీను. స్కూల్ నుండి రావడం ప్రాక్టీస్‌కెళ్ళిపోవడం. ఇద్దరికీ అన్నీ అమర్చాలి” అంది ఇంద్రాణి.

“మావాడు టీ.వి.ల్లో వచ్చే షోస్ చూసి డ్రాయింగ్ అంటే ఇంట్రస్ట్ పెంచుకున్నాడు. ఏ బొమ్మయినా చూసి అలాగే గీసేస్తాడు. బ్రషులు, వాటర్‌కలర్స్, క్రేయాన్స్,

ఎప్పుడు చూసినా వీటి మధ్యే కనిపిస్తాడు. చూస్తేనే ఇంత బాగా వేస్తున్నాడు, ఇంక అందులో మంచి శిక్షణ నిప్పిస్తే ఇంకెంత బాగా వేయగలడోనన్న ఆలోచనతో ఆయన మంచి టీచర్ దగ్గర ట్రైనింగిప్పిస్తున్నారు. స్కూల్‌నుంచి రాగానే హోమ్‌వర్క్ చేసుకుంటాడు. వెంటనే డ్రాయింగ్ క్లాస్‌కెళ్ళి రాత్రి వస్తాడు. భోంచేసి, టీ.వి. చూసి పడుకుంటాడు.'' తన కొడుకు గుణగణాలు వర్ణించింది లత.

ఇంక లలిత మొదలెట్టింది.

''నా కూతురికి స్పోర్ట్స్ అంటే చాలా ఇష్టం. రన్నింగ్, జంపింగ్‌లలో ఎప్పుడూ ఫస్ట్ వచ్చినా, దానికి వాలీబాల్ అంటే చాలా ఇష్టం. అందుకే స్కూల్‌లోనే వాలీబాల్ కోచింగ్ తీసుకుంటోంది. నేషనల్ లెవెల్‌లో ఆడాలని దాని ఆశ.''

''ఇంతకీ నీ కూతురు సంగతేంటి?'' అడిగారంతా.

''నా కూతురు చదువులో ర్యాంక్ స్టూడెంట్. ఇతరత్రా వ్యాపకాలేవీ లేకపోయినా చిన్న కవితలు, ఆర్టికల్స్ రాసి మ్యాగజైన్స్‌కి పంపిస్తూ ఉంటుంది. అది చాలు నాకు'' అన్నాను.

''చాలేంటే బాబూ! సంగీతం, నాటకం నేర్చుకుంటే వస్తాయి. నేర్పితే రానిది, సహజంగా ఏర్పడవలసిన సృజనాత్మకత నీ అదృష్టంకొద్దీ నీ కూతురికి వచ్చింది. ఈ వయసునుంచే సాహిత్యంలో ఆసక్తి చూపిస్తోందంటే అది మామూలు సంగతి కాదు'' అన్నారు లలిత, ఇంద్రాణి. లత, వసంత వంతపాడారు.

''వసంతా! నీ పిల్లల సంగతేంటి? వారికేదైనా నేర్పిస్తున్నావా? కేవలం చదువొక్కటే అయితే ఈరోజుల్లో గుర్తింపురాదు. చదువు ప్రధాన అంశమైనా అదనంగా పక్క వాయిద్యాలు లేకపోతే ఎలా? ఏదో ఒక ఆర్ట్‌లో పెట్టు'' అంది లలిత.

ఆ మాటతో వసంత ముఖం చిన్నబోయింది. ఆమె ముఖంలో దోగాడే భావాలను నేను గమనిస్తూనే ఉన్నాను. ఈ సంభాషణ మొదలైన దగ్గరనుండి ''నిజం చెప్పాలంటే నాకు సంగీతమంటే చాలా ఇంట్రస్ట్. చిన్నప్పుడు కొన్నాళ్ళు నేర్చుకున్నాను కూడా. కొనసాగించలేకపోయాను. అందుకే పిల్లలకైనా నేర్పించాలన్నది నా ఆశ. వర్ష ఇంకా చిన్నది రోహిత్‌కైతే అసలు ఇష్టమే లేదు. శాస్త్రీయ సంగీతంమీద ఆసక్తి లేకపోతే కీ-బోర్డ్ ప్లేయింగ్ కానీ, వెస్ట్రన్ డాన్స్ ఏదో ఒకటి నేర్చుకోమని బతిమాలాను. ససేమిరా తనకాసక్తి లేదన్నాడు. చదువులో అయితే క్లాస్‌లో ఎప్పుడూ టాప్ త్రీలోనే ఉంటాడు. తన చదువు పూర్తికాగానే నా వెనకాల తిరుగుతూ నాకేదో చేస్తుంటాడు. ఒకసారి బలవంతంగా బెదిరించి సంగీతంలో పెట్టాను. కానీ వెళ్ళనని మొండికేసాడు. ఆయన కూడా వాడికే వంత.

''పోన్లే! చదువులో ముందున్నాడు కదా!'' అంటారు. చదువుతోపాటు వేరే సంధ్య కూడా లేకపోతే ఎలా అని నేను మొత్తుకున్నా వినరు. మామూలుగా పిల్లలంతా కలిసి ఆడే ఆటలు తప్ప ప్రత్యేకంగా ఏ ఆటలోనూ ఆసక్తి చూపించడు.'' తన గోడండా వెళ్ళగక్కింది వసంత.

అందరం మెల్లగా నిద్రలోకి జారుకున్నాం.

మర్నాడు ఉదయం మేము లేచేసరికే కొంచెం పొద్దెక్కింది. వసంత గాభరా పడుతూ పాలుకోసం వెళ్ళబోయింది.

''అమ్మా! నువ్వు లేవలేదు కదాని నేనే వెళ్ళి పాల ప్యాకెట్లు తెచ్చేసాను.'' అన్నాడు. ఆ చిన్నవాడి బాధ్యతకు సరదా అనిపించింది.

''అరె! మొక్కలకి నీళ్ళు పోసేసావే?'' అంది వసంత. వసంత పూజకి కావలసిన పువ్వులు కోసి పెట్టాడు.

''అమ్మా! పవనన్నయ్య దగ్గరకెళ్ళొస్తాను'' అంటూ వెళ్ళాడు.

''ఊరంతా చక్కబెడతాడు'' అనుకుంది వసంత.

''ఎవరా పవన్?'' అడిగాను.

''మా ఇంటికి నాలుగిళ్ళవతల ఉంది ఆ ఇల్లు. ఆ అబ్బాయి హ్యాండీక్యాప్డ్. రోజూ ఆ అబ్బాయిని వీల్ ఛైర్‌లో ఓ పావుగంట బయట తిప్పుతాడు. ఆ పని వీడే చెయ్యాలి. లేకపోతే తోచదు.'' చెప్పింది.

* * *

అందరం ఎవరి గూళ్ళకువాళ్ళు బయలుదేరాం. లత, లలిత రాజమండ్రి బయలుదేరారు. ఇంద్రాణి విజయవాడ. కానీ రాజమండ్రిలో చుట్టాలింటికి వెళ్ళాలంటూ వాళ్ళతోటే బయలుదేరింది. ట్రైన్ రిజర్వేషన్ దొరక్క నేను బస్‌కి బుక్ చేసుకున్నాను. బస్ రాత్రి ఎనిమిదింటికి.

ఉత్తరాలు రాసుకుంటూ ఉండాలన్న నిబంధనలు ఒకరికొకరు పెట్టుకున్నాం. కానీ అది అప్పుడప్పుడే ఆచరణలో పెడతామన్న సంగతి అందరికీ తెలుసు.

కనీసం ఫోన్ బిల్ పెంచే ఖాళీ అయినా చేసుకోమని సుద్దులు చెప్పుకున్నాం.

అంతవరకు వర్షంలో ముద్దయిపోయి, వడగళ్ళు ఏరుకు తిని, పడవలు వదులుతున్న పిల్లవాడు ఒక్కసారిగా వర్షం ఆగిపోతే మూతి ముడుచుకున్నట్లు అందరం దిగాలు పడ్డాం.

పల్లలైతే ఒకరికొకరు చిన్న బహుమతులిచ్చుకున్నారు. రోహిత్ అయితే లలిత కొడుకుని వదలలేక వదిలాడు.

''ఆంటీ! బన్నూ జాగ్రత్త.'' లలితకే జాగ్రత్తలు చెప్పాడు. వాళ్ళు వెళ్ళిపోయేక నేను, వసంత ఖాళీగా కూచున్నాం. పెరట్లో పందిరి నిండా పూచిన జాజి మొగ్గలన్నీ కోసి తెచ్చి ''అమ్మా! నువ్వూ, ఆంటీ పెట్టుకోండి'' అన్నాడు.

వసంత కూతురు వర్ష చాలా నెమ్మది. దాని పనేదో అది చూసుకుంటూ ఆడేసుకుంటుంది.

''అమ్మా! పక్కింటి తాతగారిని చూసొస్తాను.'' అంటూ పారిపోయాడు.

''ఇదో కథ! పక్కింటి ముసలాయనకు ఒక్కడే కొడుకు. రెక్కలు వచ్చాక అమెరికాకు ఎగిరిపోయాడు. రోజూ ఇంటికి పార్శిల్ వచ్చే ఏర్పాటు చేసుకున్నారు. నేను వండి పెడతానన్నా ఒప్పుకోలేదు. వీడు వెళ్ళి రోజూ ఆయన యోగక్షేమాలు కనుక్కుంటాడు. ఆయనకి మందులు, పళ్ళు, బిస్కట్స్ తెస్తాడు. ఆయనతో సాయంత్రం పార్కుకి వెళతాడు. దగ్గరుండి మందులు వేస్తాడు. రాత్రి ఆయన పడుకున్నాక వస్తాడు. ఇంత టైమ్ ఇలా వృథా చేస్తాడు గానీ ఏ కళ పట్ల మక్కువ లేదు. మీ పిల్లల్ని చూస్తే ముచ్చటేస్తోంది. వీడి గురించే నాకు బెంగ?'' వసంతలోని బాధ గుండెని పిండితే గొంతులోంచి బయటపడింది.

''వాడికే కళ పట్ల మక్కువ లేదని నువ్వెందుకనుకుంటున్నావు?''

స్పష్టంగా అడిగాను. అర్థం కానట్లు, ఆశ్చర్యంగానూ చూసింది.

''మా పిల్లలందరికన్నా అద్భుతమైన ప్రతిభ ప్రదర్శించగలిగే కళే వాడికి భగవదత్తంగా వచ్చింది. నువ్వు గుర్తించలేదు కానీ ఈ రెండ్రోజుల్లోనే నేను గమనించాను.

సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం పట్ల మక్కువతో నైనా, లేదా సహజంగా అబ్బినా గురుముఖంగా నేర్చుకుంటే తప్ప వాటికి రాణింపు ఉండదు.

నిత్య అభ్యాసం, నిరంతర సాధన వాటిలో నైపుణ్యాన్ని కలిగిస్తాయి. కానీ ఎవరూ చెప్పకుండానే, ఏ గురువూ బోధించకుండానే వాడికి సంక్రమించిన కళ సహాయం చెయ్యడం. తన చిన్ని మెదడులో పుట్టిన భావాలను చిట్టి చేతులతో ఆచరిస్తున్నాడు.

ఒకరికి సహాయం చేయడమే తనకిష్టం. అదే వాడి హాబీ.

కళల ద్వారా వచ్చే పేరు చాలా గొప్పదే. కాదనను. దానివలన ఆ పిల్లలు, తల్లిదండ్రులు మాత్రమే సంతోషించగలరు. ఇంకా కొంత మంది ఆ పిల్లలలోని పాటవాన్ని గమనించి ఆనందిస్తారు.

కానీ రోహిత్‌కున్న గుణంవలన ఎందరినో సంతోషపరుస్తున్నాడు. ఈ సహాయం అనే లక్షణం వాడితో పోటీ పెరిగి పెద్దదైతే అది ఎంత అభినందనీయం?

చంటి పిల్లాడు పడిపోయి ఏడుస్తుంటే ఏ పిల్లలైనా కదిలారా? కానీ రోహిత్ మాత్రం వాడికి చేతనైన రీతిలో ఊరడింపచేసాడు. అలాగని ఆ పిల్లలంతా చెడ్డవాళ్ళు కాదు. ఒక్కొక్కరి తీరు. అంతే! ప్రతి పిల్లకీ పిల్లవాడికీ ఏదో ఒక కళ వచ్చి తీరాలన్న రూలేం లేదు.

ఒక రకంగా చెప్పాలంటే ఈ భావనని టీ.వి. ఛానల్స్ పెంచి పోషిస్తున్నాయి.

పిల్లలు స్వతహాగా ప్రేరణ పొంది నేర్చుకుంటే ఏ సమస్యా లేదు. ఏదో ఒకటి వచ్చి తీరాలనుకుని పెద్దలు అనుకుంటే తప్ప. కళ అబ్బినవాళ్ళు, ప్రతిభ చూపించే పిల్లలు గొప్ప వాళ్ళే. కానీ రాని వాళ్ళు నిరర్థకులు కాదు.

ఒకరికి సహాయం చేసి వారు పొందే ఆనందాన్ని తను అనుభవించి మురిసిపోవడం రోహిత్‌కు అబ్బిన కళ. నీ వంతు సహకారం అందిస్తే వాడో అద్భుతమైన వ్యక్తిగా ఎదుగుతాడనంతలో ఏ సందేహం లేదు. వాడిలోని ఆ గుణాన్ని పెంచి పోషించు.

నీకు సహాయం చేసి నీ పని భారంనుంచి నువ్వు రిలీఫ్ అవడం చూసి వాడు సంతోషిస్తున్నాడు.

ఇంటి దగ్గర నుండి మొదలై పక్కింటి తాతగారు, పవనన్నయ్యతో మొదలైన ఈ కార్యక్రమం వీధి వీధీ, ఊరూరా విస్తరిస్తుందేమో! మరో మదర్ థెరిసా, బాబా ఆమ్టే తయారవుతారేమో!

పది మంది లాగే నువ్వు కూడా ఆలోచించి నడవలేదని బాధపడకు. నీలాగ మరో పది మంది ఆలోచించేలా, వాడికిష్టంలేని వాటిని ఆచరింపచేసేకన్నా, వాడి అభిరుచికనుగుణంగా నువ్వు మెలగు.'' చాలా పెద్ద క్లాసు తీసుకున్నట్లు నాకే తెలిసింది. కానీ అరవిరిసిన ముద్దబంతిలాంటి వసంత ముఖంచూస్తే నా విశ్లేషణాత్మక వివరణ దానిని ప్రభావితం చేసిందనిపించింది.

''అందుకే నువ్వంటే నాకిష్టం!'' బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకుంది.

''టైమవుతోంది. టిఫిన్ పెట్టేస్తావా?'' అంటూ లోపలికి దారితీసాను. ★


రచయిత్రి చిరునామా:

టి.పి.హేమమాలిని

మధ్యవీధి,

సింహాచలం- 530028.